# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY - 2016

సంవత్సర చందా రూ. 50/-

# టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| **ఆదివారం సాయంత్రం** | : | 6.00 గంటలకు శుభవార్త |
| **బుధవారం సాయంత్రం** | : | 6:30 గంటలకు రక్షణ |
| **గురువారం మధ్యాహ్నం** | : | 2:30 గంటలకు రక్షణ |
| **ప్రతి ఆదివారం ఉదయం** | : | 7:00 గం॥ మనకాపరి టి.వి (తెనాలి గుంటూరు ఏరియాలో) |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం<br>రిక్కీ గూటం<br>రోనీ గూటం. |

పై కార్యక్రమములను టి.విలో చూడండి. మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి. ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

**P.O.BOX.80, KAKINADA**

**Pin : 533004**

**Ph : 0884-2363722**

**98489 98547**

**www.satyavanicoc.com**

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH



P.o. Box -80, KAKINADA, A.P. 533 001
Ph : 0884 - 2363722, 98489 98547



Pleading for Restoration of First Century Christianity

సంపుటి-36 ఫిబ్రవరి-2016 సంచిక-7


## మన జీవమైయున్న క్రీస్తు
### *( Christ, our Life )*

కొలస్సయిలోని క్రైస్తవులకు వ్రాయబడిన పత్రిక 3:1-11లో ఇట్లు వ్రాయబడినది:"మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్నవాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు. పైనున్న వాటి మీదనే గాని,భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టకుడి;ఏలయనగా మీరు మృతిపొందితిరి,మీ జీవము క్రీస్తుతో కూడ ప్రత్యక్షమైనప్పుడు మీరును ఆయనతో కూడ మహిమ యందు ప్రత్యక్షపరచబడుదురు.

"కావున భూమిమీదనున్న మీ అవయవములను,అనగా జారత్వమును, అపవిత్రతను,కామాతురతను,దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపి వేయుడి. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును. పూర్వము వారి మధ్య జీవించినప్పుడు మీరును వీటిని అనుసరించి నడుచుకొంటిరి. ఇప్పుడైతే మీరు కోపము,ఆగ్రహము,దుష్టత్వము, దూషణ,మీ నోట బూతులు అను వీటి నన్నింటిని విసర్జించుడి. ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి;ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి జ్ఞానముకలుగు

నిమిత్తము దానిని సృష్టించిన వాని పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనియున్నారు. ఇట్టి వారిలో గ్రీసు దేశస్థుడని,యూదుడని భేదములేదు;సున్నతి పొందుటయని, సున్నతి పొందకపోవుటయని భేదము లేదు;పరదేశియని,సిథియనుడని,దాసుడని, స్వతంత్రుడని లేదుగాని,క్రీస్తే సర్వమును అందరిలోయున్న వాడునై యున్నాడు".

కొలస్సయిలో ఉన్న పరిశుద్ధులకు,అనగా క్రీస్తునందు విశ్వాసులైన సహోదరులకు అపో.పౌలును,తిమోతియును మనము చదువుకొనిన ఈ మాటలను వ్రాసిపంపిరి.మన ప్రభువగు యేసుక్రీస్తుయొక్క తండ్రియైన దేవునికి మీ నిమిత్తము ప్రార్థనచేయుచు,కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము అని వారు ఆ పత్రికలో వ్రాసిరి.నేటి క్రైస్తవులు తమ సహోదరులకు కలిగియున్న విశ్వాసమును గూర్చియు,ప్రేమనుగూర్చియు ప్రార్థించుటలో అపో.పౌలును,తిమోతిని అనుకరించవలెను.అట్లు ప్రార్థించుటలో క్రైస్తవులకు గొప్ప సహాయము లభించును.

సువార్తకు లోబడు వారందరు క్రీస్తునందు ఉందురు. వారాయన శరీరములో అవయవములు,ఆయన సంఘములో సభ్యులు;ఆయన రాజ్యపౌరులు.ఈ లోకమునుండి రక్షించబడిన వారు.వారు బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ పాతిపెట్టబడిన వారై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేపబడిన వారు(కొలస్స 2:12). వారిని దేవుడు అంధకార సంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులుగా చేసెను(కొలస్స 1:13). అందువలన ఎవడైనను క్రీస్తునందున్న యెడలవాడు నూతనసృష్టి;పాతవి గతించెను,ఇదిగో క్రొత్తవాయెను(2 కొరి 5:17).ఒకడు ఈ పాపపు లోకమునుండి విడుదలపొంది క్రీస్తుతో క్రొత్తసంబంధము నేర్పరచుకొనిన నాడు అతడొక నూతన సృష్టియగును,ఒక నూతన జీవితంలో ప్రవేశించును,క్రైస్తవునిగ జీవించును.

క్రైస్తవుడైన వాడు క్రీస్తుతోకూడ లేపబడినవాడు.అందువలన అతడు పైనున్న వాటినే వెదక వలెనని హెచ్చరించబడెను.అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు. క్రైస్తవులు పైనున్న వాటిమీదనేగాని,

భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనరాదు. ఇది అత్యున్నతమైన జీవనస్థాయియే!

క్రైస్తవుడు ఈ లోకాశలు కలిగి జీవించుచున్న యెడల అభివృద్ధి జెందడు. లోకాశలు కలిగిన సభ్యుల వలన క్రీస్తుసంఘము కూడ అభివృద్ధి జెందనేరదు. క్రైస్తవుని జీవితములో లోకాశలకు ఆటంకము కలుగని యెడల, చివరకతడు నాశనమగును. ఈలోక సంబంధమైన ఆశల ప్రమాదము నుండి నిజముగా తప్పించుకొనినవాడు ఎవడు లేడు. అందువలన ప్రతివాడు జాగ్రత్తకలిగి యుండవలెను. అయితే మన మనస్సు భూసంబంధమైన వాటిమీద గాక, పైనున్న వాటిమీదనే నిలుపుకొనిన యెడల అది క్షేమకరము.

క్రైస్తవుడయిన వాడు మృతి బొందినవాడు, పాపము యెడల మృతి బొందినవాడు, శరీర సంబంధమైన ఆశల యెడల మృతిబొందినవాడు. అతని జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది. దేవుడును, యేసుక్రీస్తును తమ ఉద్దేశములోను, క్రియలోను ఏకమై యున్నారు. మనము ఆయన రాజ్యమైన సంఘములో ప్రవేశించినపుడు ఈ ఐక్యతలో ప్రవేశించగలము. ఏలయనగా మన జీవము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్నది. అట్లయినప్పుడు ఈ భూమిమీద మన పరిచర్య అంతయు ముగిసిన తరువాత మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మనమును ఆయనతో కూడ మహిమయందు ప్రత్యక్ష పరచబడుదుము. "మన పౌరస్థితి పరలోకమందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తిని బట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానిగా మార్చును"(ఫిలిప్పి 3:20, 21).

"కావున భూమిమీద నున్న మీ అవయవములను అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి"యని అపో. పౌలు గట్టిగా హెచ్చరించుచున్నాడు.

దేవుడు మానవుని మంచి చెడుగుల విచక్షణ జ్ఞానము గలవానిగా చేసెను. వీటిలో ఏదోఒక దానిని ఎంచుకొనే శక్తిని దేవుడు మానవునికిచ్చెను.

అయితే కీడు విషయమై భరింపరాని విధముగ మానవుడు శోధింపబడడు, మంచి విషయమై బలవంతపెట్టబడడు. అయితే మానవుడు భూమిమీద జీవించు నంతకాలము ఈ యెంచుకొనే శక్తి కలిగి యున్నాడు. అందువలననే లేఖనములలో దేవుని పిల్లలకు అనేక హెచ్చరికలీయబడి నవి. అందువలన శరీరేచ్ఛలను చంపి వేయుడని మనము హెచ్చరింపబడి యున్నాము. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికివచ్చును. మరల పరిశుద్ధాత్ముడు ఇట్లు హెచ్చరించుచున్నాడు. "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి, ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతోకూడ మీరు పరిత్యజించి, జ్ఞానముకలుగు నిమిత్తము నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనియున్నారు.

క్రైస్తవుడు కాకముందు ఒకడు కోపము,ఆగ్రహము,దూషణ,దుష్టత్వము మొ॥నవి కలిగి జీవించుచుండ వచ్చును. గాని క్రైస్తవుడు కాగానే అతడు నూతన సృష్టి;నూతన స్వభావము,నూతనజీవము కలవాడయెను. అందువలన క్రీస్తునందున్న నూతనజీవితములో అతడు నిగ్రహబుద్ధి కలిగి జీవించవలసిన అవుసరత ఎంతైనాయున్నది. క్రైస్తవులు తమ శరీరములనే గాక తమ మనస్సుల ను కూడ అదుపులో యుంచుకొనవలెను. గనుక మీరు పైనున్న వాటిమీదనేగాని భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టకొనకుడి;అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు. ఆత్మ నిగ్రహము లేకుండ ఎవడు ఏమియు ఎన్నడు సాధించలేడు.

క్రీస్తునందున్న నూతన జీవితమును జీవించుటకు మనము ప్రాచీన స్వభావమును పరిత్యజించి మన సృష్టికర్త పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీన స్వభావమును ధరించుకొనవలెనని అపొ.పౌలు చెప్పుచున్నాడు. ఈ నూతన జీవములో గ్రీసుదేశస్థుడని, యూదుడని భేదములేదు,దాసుడని, స్వతంత్రుడని భేదము లేదు గాని క్రీస్తే సర్వమును, అందరిలో ఉన్నవాడునై యున్నాడు. ఇంకొక మాటలో క్రీస్తులో అందరు సమానులే. మానవు లేర్పరచుకొనిన అన్ని వ్యత్యాసములు క్రీస్తునందు మటుమాయమగును. క్రీస్తునందు నల్లవాడని,తెల్లవాడని భేదము లేదు. కుల ప్రసక్తి అంతకు ముందే లేదు. దాసుడని, స్వతంత్రుడని భేదములేదు,ధనవంతుడని

ధనహీనుడని వ్యత్యాసములేదు. అందరు క్రీస్తునందు సహోదరులే, అందరు ఆయనలో సమానులే. క్రీస్తే సర్వమును అందరిలో యున్నవాడు. ఆయనే మన జీవము.

క్రీస్తు నందున్న ఈ నూతన జీవమును, స్వతంత్రతను, సమానత్వ మును అనుభవించాలంటే అది ఈనాడు నీకు సాధ్యమే. యేసేప్రభువని, దేవుని కుమారుడని విశ్వసించుము, నీపాపముల విషయమై మారుమనస్సు పొందుము, క్రీస్తునామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుము. పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము పొందుము. అప్పుడు నీవు నూతనసృష్టి యగుదువు. నూతన జీవితము జీవించుట కారంభించుదువు. నీవు క్రీస్తులోనికి రావాలంటే ఈ రోజు కంటె మంచిరోజు వేరొకటిలేదు సుమా!

## లోబడియుండుడి

## *( Be Submissive )*

"కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదురించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపో వును"(యాకోబు 4:7).

**దేవునికి లోబడియుండుడి!**

మనుష్యుడు అహంకారముతో నిండినవాడై తాను నడుచుచున్న మార్గము సరైనది అని తలంచుకొనును. ఇక్కడి సంధర్భం అదికాదు.

దేవుడు అహంకారులను ఎదిరించును(6 వ).

మానవులను సృజించిన దేవునికే తెలుసు ఏది ఉత్తమమైనదో! కాబట్టి మనము విధేయత కలిగినవారమై లోబడియుండాలి. 'లోబడుట' అను పదము ఒక సైన్యాధికారి క్రిందఉండు సైనికుల వలె క్రమమైన పద్ధతిలో ఉండవ లెనని చెప్పబడుచున్నది. ఆయన ఏది ఆజ్ఞా పిస్తే అది మనము తప్పక చేయుదము. రక్షణ, ఆరాధన, జీవనశైలి అను ఈ విషయములలో ఇది సత్యము. కావున లోబడియుండుడి.

**అపవాదిని ఎదురించుడి:**

అపవాది లోకాధికారిగా వ్యవ హరించుచున్నాడు. "ఇకను మీతో విస్తరించి మాటలాడను; ఈ లోకాధికారి వచ్చుచున్నాడు. నాతో వానికి సంబంధమే మియు లేదు"(యోహాను 14:30).

అపవాది మన జీవితాలకు ఎప్పుడు అధికారిగా ఉంటాడో, అప్పుడు మనము శరీరాశలను అనుసరించి, ఉగ్రతకు పాత్రులమగుదుము.

"మనమందరము శరీరము యొుక్కయు మనస్సుయొుక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు,మన శరీరాలను అనుసరించి మునుపు ప్రవర్తించు కడమ వారివలె స్వభావసిద్ధముగా దైవోగ్రతకు ప్రాతులమై యుంటిమి"(ఎఫె 2:3).

మనము అపవాది మిత్రులుగా ఎప్పుడు ఉంటామో అప్పుడు అతడే మనలను పాలించును (ఏలును), అప్పుడు మనము స్వరాధికారియైన దేవునికి శత్రు వులమగుదుము.

"వ్యభిచారులారా మరియు వ్యభిచారిణులారా,యీ లోకస్నేహము దేవునితో వైరమని మీరెరుగరా?కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును"(యాకోబు 4:4).అపవాదికి అవకాశము ఇయ్యకుడి.అతడు అబద్ధికుడు అతని ముఖ్యమైన పని మానవులను మోసగించుటయే.అపవాదికి తెలుసు అతడు నరకంలో నిత్యము మండే అగ్నిలో ఉంటాడని,మనలను కూడ అందులోనికి తీసుకువెళ్లుటకు అతనికి ఇష్టము.అటువంటి అపవాదిని మనము మన జీవితాలలోనుండి పంపివేయుదము.అపవాదిని ఎదురించుదము.

**వాడు మీ యొద్దనుండి పారిపోవును:**

ఇది ఏలాగు సంభవిస్తుంది? దేవునికి లోబడియుండి,అపవాదిని ఎదురించినప్పుడే శోధన చాలా కఠినమైనదా?తప్పించుకొనుటకు మార్గము కలదు?

"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధనతప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు.దేవుడు నమ్మదగినవాడు.మీరు సహింపగలిగినంతకంటే ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు.అంతేకాదు,సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" (1 కొరింథి 10:13).

మనము ఎప్పుడు దేవునికి లోబడియుండి,అపవాదిని ఎదిరిస్తామో, అప్పుడు మనము భయపడవలసిన పని లేదు.

"తొట్రిల్లకుండ మిమ్మును కాపా

డుటకును,తన మహిమ యెదుట ఆనంద ముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువ బెట్టుటకును,శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి,మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా,మహిమయు మహాత్మ్యమును ఆధిపత్యమును అధికార మును యుగములకు పూర్వమును ఇప్పుడును సర్వయుగములును కలుగును గాక,అమెన్"(యూదా 1:24:25).

లాయ్ మిషెల్

## పరలోకమందున్న మా తండ్రి

## *( Our Father in Heaven)*

యేసు,ప్రార్థన విధానాన్ని ఇచ్చి ఈలాగు చెప్పెను. కాబట్టి,మీరీలాగు ప్రార్థన చేయుడి. "పరలోకమందున్న మా తండ్రి,నీ నామము పరిశుద్ధపరచబడును గాక"(మత్తయి 6:9-10).

160 సార్లుకు తక్కువ కాకుండ యేసు దేవుని"తండ్రి"అని పిలిచెను. "పరలోకమందున్న మా తండ్రి".

**ఒక తండ్రి హృదయం కలిగినవాడు దేవుడు:**

"తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును"(కీర్తన 103:13).

తండ్రియైన దేవుడు తన పిల్లలైన మనమీద జాలికలిగి యున్నారు. భూసంబంధమైన తండ్రి తనపిల్లలకు చూపు వాత్సల్యత కంటె మరి యెక్కువగా దేవుడు మనయెడల జాలిచూపును. పరలోకమందుండు తండ్రి, తన కుమారుల యెడల జాలిపడి వారిమీద ఆయన కృపను ప్రకాశింపచేయును.

**ఒక తండ్రి తన బిడ్డలకు ఇచ్చే సురక్షిత నివాసం కలిగినవాడు దేవుడు:**

"నా తండ్రి యింట అనేక నివాసములు కలవు,లేని యెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను"(యోహాను 14:2).

క్రైస్తవులకు ఒక స్థిరమైన స్థలము దేవుని యొక్క గృహంలో ఉన్నది. మన సామర్థ్యానికి మించిన,మన ఆలోచనలకు గోచరము కాని ఎన్నో దీవెనలు/ఆశీర్వాదములు దేవుని యొక్క గృహంలో మనకొరకు ఎదురుచూచు చున్నవి. అవి కేవలము విశ్వాసదృష్టితో మాత్రమే చూడగలము!

**ఒక తండ్రి ప్రేమ ఎలాంటిదో అలాంటి ప్రేమగలవాడు దేవుడు:**

"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లుఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). పాపులయెడల దేవునికి ఉన్న ప్రేమ, వారికి బహు గొప్పదైన బహుమా నము ఇచ్చుటకు కారణమాయెను. ఆయన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు, ప్రతి క్షణమును తాకును(నిలుచును). ఆ ప్రేమ పరలోకమందున్న మన తండ్రి యైన దేవుని నుండి మనకు లభించెను.

**ఒక తండ్రికి ఉండే సున్నితమనస్సు కలిగినవాడు దేవుడు:**

"సహించి వారిని ధన్యులనుకొనుచున్నాము గదా? మీరు యోబు యొక్క సహనమును గూర్చివింటిరి. ఆయన ఎంతో జాలియును కనికరమును గలవాడని మీరు తెలిసికొనియున్నారు"(యాకో 5:11). దేవుడు జాలి, దయ, కరుణాసంపన్నుడిగా మనకు అరుణోదయ దర్శనము అనుగ్రహించెను"(లూకా 1:79). ఎందుకనగా, దేవుడు మనకు తండ్రి, ఆయనకు(మనపట్ల)మానవాళిపట్ల అపారమైనప్రేమ కలదు;క్రీస్తు మరణము వలన మనపాపములకు క్షమాపణ అనుగ్రహించెను. "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది"(ఎఫెసీ 1:7).

దేవుని కుమారులుగా మనము అణుకువ, విధేయత కలిగియుంటే ఆయన మనకు తండ్రిగా ఉండును. "ఆయన కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై, మెల్కీసెదెకుయొక్క క్రమములోచేరిన ప్రధానయాజకుడని దేవుని చేత పిలువబడి, తనకు విధేయులైన వారికందరికి నిత్యరక్షణకు కారకుడాయెను"(హెబ్రీ 5:8-9).

మన తండ్రియైన దేవుడు ఒక తండ్రికి ఉండు హృదయము, ఒకతండ్రికి ఉండు నివాసము, ఒక తండ్రికి ఉండు ప్రేమ, ఒక తండ్రికి ఉండు కనికరము గలవాడై యున్నారు. "పరలోకమందున్న మా తండ్రి"అని మనము యధార్థముగా పలుకగమా? —చార్లెస్ బాక్స్.

# రోమా పత్రికలో సువార్త
## *( The Gospel in Romans)*

రోమీయులకు వ్రాయబడిన పత్రిక దేవుని సువార్త పుస్తకము. ఈ పత్రిక ప్రారంభములో పౌలు తన్నుతాను పరిచయం చేసుకొనుచు దేవునిచే అతడెందుకు ప్రత్యేకింపబడ్డాడో తెలియ జేసాడు(రోమా 1:1-2). సువార్త గూర్చి అతడనేక సంగతులను వక్కాణించాడు. ఆ సువార్తను ప్రకటించుటకతడు పిలువ బడ్డాడు.

1. మొదటిగా ఆ సువార్త దేవునిది (రోమా 1:1;1కొరింథి1:18-25;గలతీ 1:11-12).

2. రెండవదిగా అది ముందుగనే ప్రవచింపబడినది. గనుక ఊహించలే నట్టిది కాదు. ప్రవక్తలచే ముందుగనే ప్రవచింపబడినది(రోమా 1:2).

3. సువార్తను గూర్చిన వాగ్దానములు, ప్రవచనములు లేఖనములలో అగుపడు ను(రోమా 1:2; 3:21; 1పేతు 1:10, 12).

4. ఇప్పుడది పరిపూర్ణముగా బయలుపర చబడినది(రోమా 10:25-26).

5. అది క్రీస్తునుగూర్చినట్టిది(రోమా1:3).

6. అది ధృడపరచబడినది(గలతీ 1:11-12; హెబ్రీ 2:3-4).

7. అది రక్షించుటకు దేవుని శక్తియై యున్నది(రోమా 1:16).

8. ప్రజలు విశ్వసించునట్లు అది ప్రకటిం పబడవలెను(రోమా1:16;10:14-17).

9. దానిని తప్పక విశ్వసించాలి(రోమా 1:16).

10. విశ్వాసము విధేయతకు నడిపించ బడాలి(రోమా1:5;15:18;16:19,26).

11. ఆ సువార్త అందరికీ(రోమా1:5; 16:26).

12. ఆ సువార్త ద్వారా దేవుడు ప్రజలను పిలుచుచున్నారు. లోకము నుండి వారిని వేరు పరచుచున్నారు(2థెస్స 2:14; రోమా 1:7;యోహాను 17:17).

13. మనుష్యులను నీతిమంతులనుగా చేయు దేవుని మార్గము దానిలో బయలు పరచబడియున్నది(రోమా 1:16-17; 3:21-26;10:1-4).

14. ఆ సువార్తనే మనము గట్టిగా చేపట్టు కొని యుండవలెను(1కొరి 15:1-5).

సువార్తలోని వాస్తవములను ఇప్పుడు పరిశీలింతము:

నమ్ముటకు వాస్తవములు:

సువార్తలో మనము నమ్మవలసిన వాస్తవములు క్రీస్తుపై కేంద్రీకృతమై యున్నవి. ఆయన దేవుని కుమారుడు(రోమా 1:3-4;అపొ.కా.9:19,22;గలతీ 1:3-5,22-24).ఈ వాస్తవములన్నీ క్రీస్తును గూర్చి యున్నవి.క్రీస్తే మన పాపముల విషయమై చనిపోయెను,సమాధిచేయబడెను,మూడవదినమున తిరిగి లేచెను (1 కొరింథి 15:1-8).

**విశ్వసించుటకు గల కారణములు:**

సువార్తలో నమ్ముటకు ఆయన మరణ,సమాధి,పునరుత్థానముల వాస్తవములే గాక,అట్లు విశ్వసించుటకు గల కారణములు కూడ ఇమిడియున్నవి. మొదటిగా,అది ప్రవచింపబడెను(రోమా 1:2;3:21;16:25;1పేతురు 1:10-12;2 పేతురు 1:19-21;అపొ.కా.24:14;28:23;26:22-23)రెండవదిగా,ఆయన గంభీరమైన మహిమకు అపొస్తలులు ప్రత్యక్షసాక్షులు(2 పేతురు 1:16-18). మూడవదిగా క్రీస్తే మృతులలోనుండి తిరిగి లేపబడెను.పునరుత్థానమును గూర్చి ముందుగనే ప్రవచింపబడెను. మరియు అపొస్తలులు పునరుత్థానుడైన క్రీస్తుకు ప్రత్యక్షసాక్షులు(రోమా 1:14; 1కొరింథి 15:3-8;యెషయా 53; అపొ.కా 4:31).నాల్గవదిగా అది అద్భుతముల ద్వారా స్థిరపరచబడెను(1కొరి 2:4-5;రోమా 15:18-19;హెబ్రీ 2:3-4).

**అధిపతి యొక్క ఆజ్ఞలు:**

సువార్తలో విధేయత చూపించవలసిన ఆజ్ఞలున్నవి.ఆయాజ్ఞలను సర్వాధిపతియైన దేవుడే జారీచేసారు.ఆయన యేసుక్రీస్తు.సువార్త ద్వారా విధేయత చూపు విశ్వాసము జనింపజేయబడాలని దేవుడు కోరుచున్నారు(2 థెస్స 1:8; 1 పేతురు 4:1.).అయితే క్రీస్తుయొక్క మరణసమాధి పునరుత్థానములకు మనము ఎట్లు విధేయతచూపించగలము? అది పౌలుద్వారా పరిశుద్ధాత్ముడు బయలు పరచిన విశ్వాసక్రమమునకు విధేయత చూపుటద్వారా సంభవించును(రోమా 6:17-18;2-5).ఇట్లు సువార్తకులోబడుట ద్వారా మనము నిలిచి యుండాలి(రోమా 6:18,4,9 12-13,22).విమోచింపబడినవారు క్రొత్తజీవితము జీవించాలి(తీతు 2:11-14).

**హెచ్చరికలు పాటించాలి:**

అవిధేయతను గూర్చి, నిర్లక్ష్యమును గూర్చి సువార్త హెచ్చరికలనిచ్చు

చున్నది(హెబ్రీ 2:1-2; 1పేతు4:17; 2 థెస్స 1:8).పాపమునభ్యసించువారి మీదికి దేవుని తీర్పువచ్చును.ఆయనకు అవిధేయులైన వారిమీదికి ఆయన ఉగ్రత వచ్చును(రోమా 2:2-11).ఇశ్రాయేలీయుల అవిధేయత వలన వారిపైకి వచ్చిన దేవుని తీర్పువిశ్వాసములో మనము కొనసాగవలెనని హెచ్చరించుచున్నది(రోమా 11:20-23).మనము పాపమువైపు తిరిగి దానిలో కొనసాగిన యెడలదానియొక్క పంటను కోతుము (రోమా 6:16,23; 1పేతురు 4:17; హెబ్రీ 3:6).

**అనుభవించుటకు వాగ్దానములు:**

సువార్తతో ముడివడిన అనేక వాగ్దానములున్నవి.మొదటిగా పాపక్షమాపణ,పరిశుద్ధాత్మయను వరము వాగ్దానము చేబడినవి(అపో.కా. 2:38). రెండవదిగా,మనము సహించగలిగిన దానికంటే ఎక్కువగా శోధించబడము (1 కొరింథీ 10:13).మూడవదిగా, దేవునితో నిత్యజీవమనే వాగ్దానము (1 పేతురు 1:3-9).

**సువార్తలో నిరీక్షణ:**

మనము రక్షింపబడిన నిరీక్షణ సువార్తలో యున్నది.మనము యేసు రక్తమువలన రక్షింపబడితిమి.అయితే నిరీక్షణ వలన కూడ మనము రక్షింపబడితిమి.నిత్యవిశ్రాంతి యొక్క నిరీక్షణ శోధనలఘడియలో మనలను ఆదుకొనును(రోమా 8:18-25; 2థెస్స 1:5-10; 1పేతురు 1:3-9).సువార్తవలన మనకు కలుగువాటన్నిటిని బట్టిమనము కృతజ్ఞత కలిగియుండాలి(2తిమో1:10).

సువార్తలోని వాగ్దానములు, హెచ్చరికలు మనకు ప్రోత్సాహమిచ్చును. మనము పాత్రులము కాకపోయినను దేవుడు మనలను ఎంతోప్రేమించి క్రీస్తును మనకొరకు బలియిచ్చెను(రోమా 5:6-10; యోహాను 4:19-21).పాపము వలన కలుగు పర్యవసానము యొక్క భయము కూడ మనము విధేయులమై జీవించునట్లు సహాయపడును(హెబ్రీ 4:1-3,11).

దేవుని కుమారుడైన క్రీస్తుచుట్టు సువార్తయున్నది.అదివేదాంతులు అల్లిన సిద్ధాంతముకాదు.అది దేవుడు యేసు క్రీస్తు ద్వారా మనకనుగ్రహించిన ప్రత్యక్షత.క్రీస్తులో సత్యము తెలియజేయబడినది.ఆయనే మార్గము,సత్యము, జీవమై యున్నారు.ఆయనే మన ప్రభువైన యేసుక్రీస్తు(రోమా 1:4).

మనము ఆయనను ప్రభువని పిలిచి ఆయనచెప్పినట్లు చేయకుండా యుండరాదు(మత్తయి 7:21;లూకా 6: 46). ఆయన మన విమోచకుడు మరియు ఆయనలోనే రక్షణయున్నది (రోమా 3:21-27;అపో.కా.4:12).

## యేసు నరావతారమెత్తక ముందే దేవుడు
## *( Jesus as Pre-Incarnate God)*

**పరిచయము:**

1. యేసు ఈలోకమున కరుదెంచక ముందు నుండే ఉండియుండెను. ఆయన మానవాతారిగ రాకముందు నుండే దేవుడైయుండెను,అట్లెరుగబడియుండెను. కన్య మరియ గర్భమున ఉద్భవించక ముందు నుండే ఆయన యుండెను.

2. దైవత్వములోని రెండవ మూర్తి ఈ లోకమున కవతరించక ముందు యేసుక్రీస్తు పాత్రను కలిగియుండలేదు. కైసరు ఔగుస్తుకు ముందు మెస్సీయ,క్రీస్తు,దేవునికుమారుడు అద్వితీయ కుమారుడు అను పదములు లేవు. క్రైస్తవయుగమునకు ముందు తండ్రి,కుమారుల సంబంధము పెద్దగా నిర్వచింపబడలేదు గాని యోహాను 1:1 లో యోహాను దానిని నిర్వచించాడు. అక్కడ దేవుడు, దేవుని వాక్యము అనే సంబంధము ఉచ్చరించబడినది. ఈసంబంధము తండ్రికుమారుల అత్యంత సన్నిహిత సంబంధమును వ్యక్త పరచుచున్నది. ఇద్దరు సర్వసమానులే, మహిమాన్వితులే.

3. తండ్రితోను,పరిశుద్ధాత్మునితోను కలసిచేసిన సృష్టివలన క్రీస్తుయొక్క పూర్వపు ఉనికి ప్రశ్నింపతగని సత్యము (ఆది.కా.1:26-27;కొలస్స1:15-17).

4. యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికి లేఖనములలో కూడ బోధింపబడినది."యేసుక్రీస్తును గూర్చిన పఠనము ఏదైనా ఆయన 33 సంవత్సరముల భూనివాసమే గాక,ఆయన నిత్యఉనికి గూర్చికూడ యుండవలెను. మన రక్షకుడు ఈ లోకమున కవతరించకముందు నిత్య ఉనికి కలిగియున్నారని బైబిలు విపులముగా బోధించుచున్నది.

5. గనుక పూర్వమునుండి యున్న దేవుడైన యేసును కనుగొనాలని ఈ పాఠము మిమ్మును ఆహ్వానించుచున్నది.

ప్రధానాంశము:

1.యేసుక్రీస్తు మొదటి నుండి ఉనికి కలిగియున్న వాడని పాతనిబంధన బోధించుచున్నది.

ఎ).సృష్టి జరిగించుటలో తండ్రి తోను,పరిశుద్ధాత్మునితోను కలసి దైవత్వ ములోని రెండవ వ్యక్తి పాలుపొందెను గనుక ఆయన పూర్వము నుండి యున్న వాడు.

1.దేవుడే లోకమును సృజించెను (ఆది.కా.1:26-27;రోమా 1:20).

2.ఈ లోకమును సృజించుట లో యేసుక్రీస్తు ముఖ్యపాత్రను వహించెను (1కొరింథీ 8:6; ఎఫెసీ 3:9; కొలస్స 1:15-17; యోహాను 1:1-3).

ఎ).పాతనిబంధన ప్రవచనము లు యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని చాటుచున్నవి.మీకా 5:2లో ఇశ్రాయేలు ను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను అని చెప్పబడెను.

1.బేత్లెహేములో యేసు జన్మించునని మీకా ప్రవచించినప్పుడు ఆయన పురాతన కాలము నుండి శాశ్వత కాలము ప్రత్యక్షమగుచుండెనని చెప్పుటలో జాగ్రత్తవహించెను.ఆయన శాశ్వతకాలము ప్రత్యక్షమగుటయేగాక యూదయ బేత్లెహేములో ఒక శిశువుగా జన్మించునని చెప్పబడెను.ఆయన నిత్య త్వమును గూర్చి తెలియజెప్పుటకు ఈ మాటలు వినియోగింపబడెను.

2.పాతక్రొత్తనిబంధన ప్రవచ నములను తరచి చూచిన దానియేలు 7: 13-14 వచనములలో దేవుడు భూమిమీద నివాసముండుటకు ఏతెంచిన విధానము గ్రహింపగును.కన్య గర్భము ద్వారా ఆయన ఈ లోకమున కుద్భవించెను(యెషయా 7:14;యోహా 1:1-3,14;గలతీ 4:4).

3.యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చిన ప్రవచనములను అపొ. పేతురు ఎత్తిచూపించెను(1పేతు 1:10-11).ప్రవక్తలలో క్రీస్తుయొక్క ఆత్మ ఉండినందున,వారి కాలములో క్రీస్తు యుండెను.అది క్రీస్తుయొక్కదైవత్వమును రూఢిపరచుచున్నది.

2)క్రొత్తనిబంధన లేఖనములు యేసుక్రీస్తు యొక్క పూర్వపుఉనికిని గూర్చి తెలియజే యుచున్నది:

1.క్రీస్తుతానే తన పూర్వపు ఉనికిని గూర్చి వక్కాణించారు.ఆయన

భూసంబంధమైన ఆరంభము,తత్వము కంటే ఉన్నతుడు."మీరు క్రిందవారు" అని తరుచు యూదులకు ఆయన ఉద్భోధిం చారు(యోహాను 8:23)."నేను పైనుండు వాడను;మీరు ఈలోకసంబంధులు నేను ఈలోక సంబంధుడనుకాను"(యోహాను 17:16 పోల్చిచూడుము).అందు వలన మనుష్యకుమారుడైన ఆయన "పరలోకమునకు రాకముందునుండే యున్నవాడు.ఆయన ఈ పూర్వపుఉనికి వివరముగా వక్కాణించబడినది, ''అలాగైతే మనుష్యకుమారుడు మునుపున్న చోటునకు ఎక్కుటమీరు చూచిన యెడల ఏమందురు?"(యోహా 6:62).ఆయన పూర్వము నుండి మాత్రమే గాక నిత్యత్వము నుండి ఉనికి కలిగియుండెను.గనుక ఆయన ఇట్లు ప్రార్థించారు:"తండ్రీ లోకము పుట్టక మునుపు నీ యొద్ద నాకు ఏమహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు మహిమ పరచుము'' (యెహాను 17:5,24). అందుకే "అబ్రాహాము పుట్టకమునుపే నేను ఉన్నానని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాన నేను" (యోహాను 8:57).

2.ఆయనపరలోక సంబంధి నని చెప్పుచు యేసుతాను పైనుండి వచ్చిన వానినని తరుచు ఉద్ఘాటించారు. మరియు ఆయన చనిపోవకముందు తండ్రీయొద్ద లోకము పుట్టకమునుపు తనకున్న మహిమనుగూర్చి ప్రార్థించారు. "తండ్రీ,లోకము పుట్టకమునుపు నీ యొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము"(యోహాను 17:5).

3.ఈలోకమును విడిచి తండ్రి యొద్దకు ఆయన తిరిగి వెళ్లకమునుపు ఈలోకములోయున్నారు.అది వాస్తవము. గనుక తండ్రియొద్ద నుండి ఈలోకమున కు వచ్చుటకు ఆయన తండ్రితో కూడ పరలోకమందుండెను.యిది క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని నిర్ధారించుచున్నది. ఆయన కన్య మరియకు బేత్లేహేములో జన్మించక ముందునుండే ఉండియుండె ను.ఆయన ఎల్లప్పుడు ఉండెను.

బి).అపొస్తలుడైన యోహాను యేసుక్రీస్తు యొక్క పూర్వపుఉనికిని గూర్చియు,నరావతారమెత్తక ముందు నుండేఆయనఉనికి కలిగియున్నారనియు బోధించెను.

1.క్రీస్తు యొక్కపూర్వపు ఉనికిని గూర్చి చెప్పునది యోహాను సువార్త

ఒక్కటి మాత్రమేయని అనేకులు తలంతురు.

"యేసుక్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని గూర్చి తెలియజేయునది యోహానుసువార్త మాత్రమే"యని Winklar అనువాడు చెప్పాడు. "యోహాను సువార్త క్రీస్తుయొక్క పూర్వపు ఉనికిని బోధించుచున్నది" (Christo logy).

2. యోహాను Logos అను గ్రీకు పదమును ప్రత్యేకముగా ఉపయోగించాడు. అది క్రీస్తుయొక్క పూర్వపు ఉనికిని చెప్పుచున్నది(యోహా 1:1-3; 14).

3. అపొ. యోహాను యేసు ప్రభువు బాప్తిస్మము పొందిన సందర్భములో బాప్తిస్మమిచ్చు యోహాను చెప్పిన మాటలను రికార్డుచేసెను. అవి యేసు యొక్క పూర్వపు ఉనికిని సూచించు చున్నవి: "నా వెనుక వచ్చువాడు నాకంటె ప్రముఖుడు గనుక ఆయన నాకంటె ముందటివాడనియు,నేను చెప్పిన వాడు ఈయనే అనియు ఎలుగెత్తి చెప్పెను" (యోహా 1:15).

బాప్తిస్మమిచ్చు యోహాను యేసు కంటె ఆరునెలలు ముందుగా జన్మించెను గాని యేసు యోహాను కంటె ముందు నుండే యుండెను. ఆయన నిత్యవాక్యమై యుండెను. గనుక యేసుయొక్క నిత్య తత్వమును గూర్చి యోహాను యేసు ఇక్కడ వర్ణించెను(McGarvey). 1యోహాను 1:2లో యోహాను యేసు యొక్క పూర్వపు ఉనికిని ఆయన తదుపరి అవతారమును వక్కాణించాడు. ఆయన నరావతార మెత్తకముందు తండ్రి యొద్ద ఉండెను. నిత్యము ఉండియుండెను.

యేసుప్రభువు దేవుడు అని చెప్పు ప్రతిలేఖన భాగము దైవత్వములోని మిగతా యిద్దరు మూర్తులవలె నిత్యుడని తెలియజేయుచున్నది. యేసు శరీరాకారమును ధరించెననగా ఆయన పూర్వపు ఉనికిని,నిత్యతత్వమును ఉద్ఘాటించు చున్నది(యోహాను 20:28; అపొ.కా. 20:28).

సి)అపొ. పౌలు క్రీస్తు యొక్క పూర్వపు ఉనికిని,పూర్వావతారమును గూర్చి తరుచుబోధించెను.

1. క్రీస్తు శరీరాకారముతో ఈ లోకమునకు రాకముందు భూసంబంధ ప్రక్రియలో పాల్గొనెనని పౌలు బోధించెను (1 కొరింథీ 10:4,9). క్రీస్తు ఇశ్రాయేలీయులను ఆత్మీయముగా బండవలె వెంబ

డించెనని 1 కొరింథీ 10:9లో చెప్పబడి నది. ఇశ్రాయేలీయులను నిజానికి వెంబడించినది బండకాదు గాని క్రీస్తు. అదివారి అరణ్యయాత్రలో వెంబడించిన దేవునిదూత.మన పితరులు ఆయనకు లోబడనొల్లిరి(అపో.కా. 7:38,39).పౌలు చెప్పినబండ యేసుక్రీస్తే.బండలోనుండి అరణ్యములో మోషే నీళ్ళు రప్పించగా ఇశ్రాయేలీయులు ఆబండలోని నీళ్ళను నిజముగా త్రాగిరి(నిర్గమ 17:5).అయితే ఇక్కడ అంతకన్నా ఎక్కువ దృశ్యమగు చున్నది.ఆబండ క్రీస్తే.ఆబండ యొక్క సారూప్యము కాదు,ఆబండ క్రీస్తే.యిది క్రీస్తుయొక్క పూర్వపు ఉనికియొక్క రుజువైయున్నది.

**2 కొరింథీ 8:9 ని ఆలోచించుము:**

"మనప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా?ఆయన ధనవంతుడై యుండియు మీరుతన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను". యేసు ధనవంతునివలె పూర్వము ఉండి యుండని యెడల ఆయన ఎప్పుడు అట్లుండెను?భూమిమీద యున్నప్పుడు మాత్రముకాదు. ఆయన పశువుల పాకలో జన్మించెను,తనదికాని నావలో గలిలయ సముద్రములో సంచరించెను.ఒకని యొద్ద అడిగిపుచ్చుకొనిన ఆహారముతో వేలకొలది జననమూహములకు ఆహారము నిచ్చెను,ఎరువు తెచ్చుకొనిన గాడిదపై యెరూషలేములో ప్రవేశించెను. వేరొకని మేడగదిలో తన పస్కానాచరించెను చివరిగా వేరొకని సమాధిలో పాతిపెట్టబడెను."నక్కలకు బొరియలును, ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకునైనను స్థలములేదు"(లూకా 9:58).

**3.ఫిలిప్పీ 2:5-11** లేఖనభాగము యేసుయొక్క పూర్వపుఉనికిని గూర్చి, నరావతారమును గూర్చి ప్రత్యక్షముగా చెప్పుచున్నది. ఈలేఖనభాగ ములో అపో.పౌలు యేసుయొక్క పూర్వపు ఉనికిని,నరావతారమును,పట్టాభిషేకమును గూర్చి చెబుతాడు.ఆయన దేవునితో సమానుడు,మనుష్యరూపము దాల్చాడు, అందరికంటె ఉన్నతునిగా హెచ్చింపబడ్డారు.అదే రీతిగా హెబ్రీలేఖకుడు ఆయన ద్వారా ప్రపంచములు నిర్మించబడెను అనగా ఆయన పూర్వము నుండి యుండెను,పాపములకు శుద్ధీకరణము తానే చేసారు(రోమా 8:3)అనగా నరావ

తారమెత్తారు మరియు దేవుని కుడి పార్శ్వ మున అశీనుడైయున్నారు(హెబ్రీ1:2,3).

4. యేసుక్రీస్తుకు అప్పగించబడిన ఇతర క్రియలకు ఆయనపూర్వపు ఉనికికి గల సంబంధము యేమిటి?

ఎ) యేసుక్రీస్తు ఈ లోకమునకవతరించక ముందు ఎట్టిపాత్ర కలిగియుండెను?

1) యేసుక్రీస్తు సృష్టిక్రియలో పాల్గొనెను (ఆది.కా.1:26-27; యోహాను 1:1-3; హెబ్రీ1:2-3).

2) యేసుక్రీస్తు ఇశ్రాయేలీయులు అరణ్యములో ప్రయాణించుచుండగా వారితో సంచరించెను(1కొరింథీ 6:4,9).

ఇశ్రాయేలీయులందరు అరణ్యముగుండా ప్రయాణించుచున్నప్పుడు యేసుక్రీస్తు వారిని ఆత్మీయముగా తన నోటిమాటల ద్వారా సంరక్షించుచు వచ్చెను(Applebury 183).

బి) నరావతారమెత్తిన తరువాత యేసు ఎట్టి పాత్ర కలిగియుండెను?

1.యేసు నశించిన దానిని వెదకి రక్షించుటకు వచ్చెను(లూకా 19:10).

2 దీనిని ఆయన పరిచర్యద్వారా,సిలువ మరణము,సమాధి,పునరుత్థానము, ఆరోహణము ద్వారా ఆయన సాధించెను (1కొరింథీ 15:3-4;మార్కు 16:19).

3.యేసు ఈలోక రక్షకుడాయెను (1యోహాను 4:14).

సి)యేసు పరమున కారోహణమైన తరువాత ఆయన పాత్రయేమిటి?

1.యేసుక్రీస్తు మధ్యవర్తి,ఉత్తరవాది (1తిమోతి 2:5; హెబ్రీ7:25).

2.యేసు మరలవచ్చి రక్షింపబడిన వారిని కొనిపోవును(యోహాను 14:3).

3.ఆయన మరల వచ్చునప్పుడు అవిధేయులను శిక్షించును(హెబ్రీ 10:29-30; 2 థెస్స 1:7-9).

4.అన్నికాలములలో యున్న మానవజాతి కంతటికిని యేసుక్రీస్తు తీర్పుతీర్చును (యోహాను 5:20-29).

**ముగింపు:**

యేసుప్రభువు నిత్యత్వమునుండి దేవుడైయుండెను.శరీరావతారాయైనను కూడ ఆయన దేవుని స్వరూపము గలవాడై,దేవునితో యుండెను,దైవసమానుడైయుండెను.దేవుడై యుండెను(ఫిలిప్పీ 2:6;యోహాను 1:1-3).తండ్రితో సమాన మహిమను కలిగియుండెను (యోహాను 17:5).రక్షకునిగా యుండుటకు వీటిని త్యజించెను.

1.క్రీస్తుతన తండ్రియొక్క వర్తమానకునిగా లేకదూతగా,తండ్రిచేత పంపబడెను,పిత

రులకు అయన దర్శనమిచ్చినప్పుడు యెహోవాదూతగా పలుకబడెను.

2.క్రీస్తు ఈలోకమునకు వచ్చినప్పుడు దైవతత్వమును త్యజించి,తన పూర్వపు మహిమను కూడ విడిచివచ్చెను (యోహాను 17:4-5; 2 కొరింథీ 8:9).

3.లేఖనముల యొక్క పరిరక్షకులును సొత్తుదారులైన యూదులు యేసుయొక్క పూర్వపు ఉనికిని వక్కాణించిరి.

4.గనుక యరియ కుమారుడైన యేసు యొక్క దైవత్వాన్ని నిరాకరించు ఏ దృక్ప థమైనను లోపభూయిష్టమైనదే.

ఆహ్వానము:

1.యేసు మొదట ఈలోకమునకు వచ్చి నప్పుడు"దేవుడు తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు"(యోహాను 3:17).

2.అయితే యేసు రెండవసారి వచ్చి నప్పుడు ఆయన రక్షింపబడిన వారిని తనతో చేర్చుకొని,నశించిన వారిని శిక్షించును(హెబ్రీ 5:8-8-9; 1థెస్స 4: 13-18; 2 థెస్స 1:7-9).

3.యేసు మరల వచ్చినప్పుడు నిన్ను యేమిచేయును?(మార్కు 16:15; 1 యోహాను 1:9).

– లూయిస్ రషోమెం

## "నేనున్నాను నన్ను పంపుము"
## *(Here Iam, Send Me)*

మనదేవుడు ప్రేమించు దేవుడై యున్నారు.తన ప్రేమను ఎల్లవేలళా ప్రజలకు తెలియజేయగోరు దేవుడు,పాత నిబంధన కాలములో ఆయన తన ప్రేమను తెలియజేయుటకు గోత్రకర్తల తోను ప్రవక్తలతోను నేరుగా సంప్రదిం చారు.మన కాలములో ఆయనతన లిఖిత పూర్వకవాక్యము ద్వారా మాటలాడు చున్నారు.ఆయన ప్రేమనుగూర్చి,శాసన ములను గూర్చి మనం ఇతరులకు తెలియజేయాలని కోరుచున్నారు.

ప్రవక్తయైన యెషయాకాలంలో దేవుడుతన ప్రజలైన ఇశ్రాయేలీయులకు ఒక ప్రత్యేకవర్తమానము నందించుటకు ఆయనకు ఒకరు కావలసియుండెను. గనుక"మేమెవరిని పంపుదుము? మా కొరకు ఎవడు పోవును?అని ఆయన అడుగగా,"నేనున్నాను,నన్ను పంపుమని" యెషయా జవాబిచ్చాడు(యెషయా 6:7-8).ఇతరులకు దేవుని చిత్తమును

తెలియజేయుటకు తనవంతు పనిని చేయుటకు అతడు సిద్ధముగాయున్నాడు.

దేవుని రక్షణ వర్తమానము నేడు ప్రజలకు తెలియజేయబడాలి. ఆయన దాసులు"నేనున్నాను,నన్ను పంపుమని" చెప్పాలి. తార్సువాడైన సౌలు దేవుని పిలుపును విన్నప్పుడు,"నేను ఈ ప్రజల వలనను అన్యజనులవలనను హాని కలుగకుండ నిన్ను కాపాడెదను. వారు చీకటిలో నుండి వెలుగులోనికిని సాతాను అధికారము నుండి దేవుని వైపునకును తిరిగి"పాపక్షమాపణ పొందునట్లు నిన్ను వారియొద్దకు పంపెదనని ప్రభువు అతనితో చెప్పెను (అపొ. కా. 26: 16-18). సౌలు తన క్రియలతో నేనున్నాను,నన్ను పంపుమని తెలియ జేసాడు. మరియు తన శేషజీవితము నంతయు సువార్త ప్రకటించుటకు వినియోగించాడు. దేవుడు బాలుడైన సమూయేలును పిలిచినప్పుడు అతడు ప్రభువా, "నీ దాసుడు ఆలకించు చున్నాడు,ఆజ్ఞయిమ్మనెను"(1సమూ 3:10). ఇంకొక మాటలో ప్రభువా ఇశ్రాయేలీయులలో మీ పనిని చేయుటకు సిద్ధముగా యున్నానసెను.

"నేనున్నాను,నన్ను పంపుమని" మనం ఎందుకు చెప్పాలి?

1. మొదటిగా,సువార్తను ఇతరులతో పంచుకొనుటలో మన వంతుపనిని మనం చేయాలి."మీరు సమస్త జనులను నాకు శిష్యులనుగా చేయుడి"యని ఆయన యిచ్చిన ఆజ్ఞను మనం తీవ్ర ముగా పాటించాలి.

2. మనం ఆయనచిత్తాన్ని జరిగించుటకు వెళ్ళినప్పుడు దేవుడు సంతోషిస్తారు. కొలస్సయులోని క్రైస్తవులు"ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించిన వారునై ప్రతి సత్కార్యములో సఫలుల గుచు,దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు అన్నివిషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు"నడుచుకొ నవలెనని(కొలస్స 1:12) పౌలు వారి కొరకు ప్రార్థించాడు.

3. ఆయనతో నిత్యము జీవించునట్లు ఇతరులుకూడా ఆయన వర్తమానములు వినాలి."మీరును సత్యవాక్యమును అనగా మీ రక్షణసువార్తనువిని క్రీస్తునందు విశ్వా సముంచి,వాగ్దానము చేయబడిన ఆత్మ చేత ముద్రింపబడిరి"(ఎఫెసీ 1:13).

4. ఆయన నామము మహిమ పరచబడ్తాది. "దేవుడు సత్యవంతుడని స్థాపించుటకును, అన్యజనులు ఆయన

కనికరమును గూర్చి దేవుని మహిమపరచుటకును క్రీస్తు సున్నతి గలవారికిని పరిచారకుడాయెను. అందువిషయమై ఈ హేతువుచేతను అన్యజనులలో నేను నిన్ను సుత్తింతును, నీ నామ సంకీర్తనము చేయుదునని వ్రాయబడి యున్నది. యరియు అన్యజనులారా, ఆయన ప్రజలతో సంతోషించుడి అనియు మరియు సమస్త అన్యజనులారా ప్రభువును సుత్తించుడి, సకల ప్రజలు ఆయనను కొనియాడుదురు గాక అనియు చెప్పబడియున్నది"(రోమా 15: 9-11).

5. ఆయన సంఘము అభివృద్ధి చెందును. హింసనొందుచున్న క్రైస్తవులు "సువార్త ప్రకటించుచు సంచారము చేసిరి" (అపొ. కా. 8:4). మరియు సౌలు క్రైస్తవుడైన తరువాత సంఘములు బలపడెను. "కావున యూదయ గలిలయ సమరయ దేశములందంతట సంఘము క్షేమాభివృద్ధినొందుచు సమాధానము కలిగియుండెను"ప్రభువు నందు విస్తరించుచుండెను (అపొ. కా. 9:31).

"నేనున్నాను, నన్నుపంపుమను మాటలకు యేసుక్రీస్తే ఒకగొప్ప ఉదాహరణగాయున్నారు. "నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగివచ్చితిని" అని ఆయన చెప్పెను(యోహాను 6:38).

"నన్ను పంపినవాడు నాకు తోడైయున్నాడు; ఆయనకిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును"అని ఆయన చెప్పెను(యోహాను 8:29). ఆయన ఆజ్ఞాపించిన సంగతులను చేయుచు ఆయనకు ప్రీతికరముగా సేవచేయుదము.

- కోలిన్ మెక్‌గీ

**గమనిక:**

**సత్యవాక్కు సాలు చందా మీరు ఇంకను పంపని యెడల వెంటనే పంపించండి. మీ బంధు మిత్రులు ఈ పత్రిక చదివేలాగున ప్రోత్సహించండి.**

**- ఎడిటర్**

# సంక్షిప్త వార్తలు

2016 జనవరి 5వ తేదీనాడు అమెరికా నుండి సోదరులు లేనీజోబ్, రాన్ బెన్‌కాఫ్ గార్లు కాకినాడ చేరుకొనిరి. జనవరి 6వ తేదీనాడు రిక్కీ గూటం గారితో కలసి పెద్దాపురంలో యున్న లెప్పర్ కోలనీలో కుష్టురోగుల మధ్య వాక్యపరిచర్యచేసిరి. అక్కడ సోదరులు జాన్ గారు సువార్త పరిచర్య చేయుచున్నారు.

2010 జనవరి 8వ తేదీనాడు కాకినాడ సత్యవాణిలో జరిగిన సువార్తికుల సదస్సులో దినమంతయు పై నుదహరించిన సహోదరులు వాక్యపరిచర్య చేసిరి. అనేకమంది సువార్తికులు వాక్యములో బలపడిరి. సహవాసములో యున్న మాధుర్యమును చవిచూచిరి. స్థానిక సంఘము మంచి భోజనములనేర్పాటుచేసిరి

2016 జనవరి 9వ తేదీనాడు తుని మండలంలో వెంకటాపురంలో జరిగిన సువార్త కూటములో లేనీజోబ్ గారు, రాన్ గారు, రిక్కీగూటం గారు మరియు రిక్‌జాన్సన్ గార్లు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. కొందరు స్త్రీ, పురుషులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ సోదరులు బాబూరావ్ గారు సువార్త చాటుచున్నారు.

2016 జనవరి 11వ తేదీనాడు రౌతులపూడిలో యున్న బంగారుపేటలోను, 12వ తేదీనాడు రాపర్తిలోను జరిగిన కూటములలో సోదరులు వాక్యమునందించిరి. బంగారుపేటలో ఐ. ఇశ్రాయేలు గారును, రాపర్తిలో బండి మోజెస్ గారును సువార్త చాటుచున్నారు.

2016 జనవరి 13 నుండి 17 వరకు పై నుదహరించిన సోదరులు రిక్కీగూటం గారితో కలిసి చింతపల్లి ఏరియాలోవున్న సంఘములను సహోదరులను దర్శించి వాక్యపరిచర్య చేయగా అనేకులు క్రీస్తులోనికి చేర్చబడిరి.

2016 జనవరి 18న కొప్పిగుంటలోను, 19న రాయవరంలోను కూటములు జరిగెను. కొప్పిగుంటలో బూల యోహాను గారును, రాయవరంలో నతానియేలుగారును కష్టించి పనిచేయుచున్నారు. జనవరి 21న లేనీజోబ్ గారు, రాన్ గారు అమెరికాకు తిరిగి ప్రయాణమైరి.

2016 జనవరి 24,25,26 తేదీలలో మద్రాసు పట్టణము కొరుక్కుపేటలోని క్రీస్తు సంఘము తమ 24వ వార్షికోత్సవ సహవాస కూటములను ఘనముగా

నిర్వహించిరి. అక్కడ సోదరులు వి. రాజు గారు (సెల్ : 9444295263) గత 24 సంవత్సరములుగా కుటుంబసమేతముగా నిర్విరామకృషి చేస్తు క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించుచున్నారు.

ఈ సహవాస కూడికలలో హైదరాబాద్ నుండి టి.వి. సాంసన్ రాజు గారు, కాకినాడ నుండి జాషువా గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. జాషువా దంపతులు ఆఖరి దినమున ఈ కూటములలో పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. మూడు దినములలోను మంచి ఆత్మీయపాఠములను దేవుని గ్రంధము నుండి బోధింపబడుచుండగా హాజరైనవారందరు సంతోషించిరి. ప్రతిరోజు మూడువందలకు పైగా సోదరసోదరీలు హాజరవుచుండగా స్థానిక సంఘము వారికి మంచి భోజనకార్యక్రమమును నిర్వహించిరి. సోదరులు వి. రాజు గారు కొరుక్కు పేటలోని క్రీస్తు సంఘమును స్వయంపోషక సంఘముగా తీర్చిదిద్దుటయే గాక, ముగ్గురు పెద్దలును, ఏడుగురు పరిచారకులును గలిగి మాదిరకరమైన క్రీస్తు సంఘముగా దానిని వాక్యప్రకారమునడిపించుచున్నారు. క్రీస్తు కొరకు వారి కృషి అభినందనీయమైనది.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.